# అనాథ రక్షణ

ఇందిరకు పట్నం నిండా స్నేహితులే. వాళ్ళల్లో నేనూ ఒకణ్ణనుకోండి.

కాని నే నెరిగినంత బాగా ఇందిరని మరెవ్వరూ ఎరగరని నా నమ్మకం. ఇందిరకు కాస్తో కూస్తో పిచ్చి ఉందని తెలుసుకున్నవాణ్ణి నే నొక్కణ్ణే!

ఇందిర ఇంటర్మీడియెట్ పాసయింది. ఆమె కింకా పెళ్ళి కాలేదు, ఇక కాదు.

వాళ్ళ అమ్మా నాన్నా ఇందిర నింటికి రానివ్వరు. ఇందిర తన ఎత్తు ధనం పోసినా పోదు కూడానూ.

అమ్మ దగ్గిరకీ, నాన్న దగ్గిరికీ వెళ్ళాలిసిన అవసరంలే దిందిరకు. ఇందిర పినతండ్రి కొడుకు సోమయాజులు ఆ భోగం వాళ్ళమ్మాయిని పెళ్ళాడి, ఉద్యోగం చేస్తూ పట్నంలో ఉన్నాడు. ఆ పెళ్ళిని అందరికంటె ముందుగా రెండు చేతులూ ఎత్తి ఆశీర్వదించినది ఇందిరే!

సోమయాజులుగారిల్లు కేంద్రంగా పెట్టుకుని ఇందిర పరిభ్రమిస్తూ ఉంటుంది.

నవమస్థానంలో కాబోలు శనో ఏదో ఉండటం మూలాన ఇందిర ఇతర్ల కష్టాలుచూసి భరించలేదు. ఓ మాట సలహా గాని, యథాశక్తి చాకిరిగాని, ఎవరిదగ్గిర్నించన్నా తీసుకుని ఓ అయిదు రూపాయల నోటు గాని అనాథలకివ్వకుండా ఇందిర రోజు గడపలేదు.

నా కిందిర పరిచయం ఎట్లా అయిందో చెప్పటానికి కొంచెం సిగ్గుగా ఉంది.

"ఇందిరకంటె సులభంగా చేతి కందే మనిషి ఉండబోదు" అని ఓ స్నేహితుడు జారవిడిచాడు.

"డబ్బు మాట?" అన్నాను, కాస్త జాగర్త మనిషిని గనక.

నా స్నేహితుడు నవ్వి, "ఇందిర ఎట్లాగైనా డబ్బు వొదిలిస్తుంది - పరిచయం కూడా అక్కర్లేదు. మొహం ఎరిక ఉంటేనే చాలు... అయితే ఎన్నడూ సొంతానికని అడగదు - ఎప్పుడూ లోకోపకారార్థమే!"

ఇందిరతో పరిచయం అయింతరవాత నా స్నేహితుడికి ఊహాశక్తి లేదని తెలుసుకున్నాను. అతను నాకు ఇందిర ఆడతనం ఆశ చూపాడు గాని, అసలామనిషి

వెయ్యి వరహాల విలువ చేస్తుంది. ఇందిర మొగవాడే అయినా ఆ మనిషి నెరగటం ఓ అద్భుతమైన అనుభవమే.

ఇందిర అమూల్యమైన మనిషి.

ఆమె ఆడతనం జోలికి వెళ్ళలేదని కాదు – వెళ్ళాను. పరిచయమైన కొద్ది రోజులకే ఇద్దరమూ కలిసి అట్లా సినిమాకు వెళ్ళి అటునుంచి నా గదికి తీసుకెళ్ళాను. పన్నెండింటి దాకా ఇందిర నాకు అందరి కష్టాలూ చెప్పి, పొద్దు పోయింది వెళతానన్నది.

నేను వొద్దన్నాను. ఆ రాత్రికి నా గదిలో ఉండి పొమ్మన్నాను. ఎవరి కన్నా తెలిస్తే ఏమన్నా అనుకోరా అన్నది. వాళ్ళనుకోవటం అబద్ధం చెయ్యటం దేనికన్నాను.

ఇందిర కొంచెం ఆలోచించి తన మీద నాకు ప్రేమా అనడిగింది. ఎందుకంటే నేను ప్రేమ ఉన్నట్టు కనిపించలేదన్నది.

నాకు ప్రేమలో నమ్మకం లేదన్నాను.

ఇందిర మొహం చాటంత అయింది. ఆమె వెళ్ళే ప్రయత్నం మాని, మళ్ళీ కుర్చీలో కూచుంటూ నాకు ప్రేమ ఏమిటో చెబుతానన్నది. అని చెప్పింది.

శ్రీనివాసరావని ఓ అబ్బాయి తనకన్న ఒక్క ఏడాదే పెద్ద. మద్రాసులో చదివేవాడు. వాళ్ళు చాలా భాగ్యవంతులు. సీనుకు చాలా చిన్నతనంలోనే పెళ్ళి అయింది. పట్నంలో అడ్డమైన స్నేహితులందర్నీ దగ్గరికి తీసి డబ్బు తగలేసే వాడు. ఎవరికీ కాదనలేడు. అతన్ని ఉద్ధరించే ఉద్దేశంతో తను అతని సావాసం ప్రారంభించి అతనికి గార్డియన్ అయింది.

మగవాడికీ ఆడదానికీ సావాసం అయిన తరువాత అది ప్రేమగా పరిణమించకుండా ఎట్లా ఉంటుందీ? అందులో సీను తనని గాఢంగా ప్రేమించాడని తనకు మొదటనే తెలిసిపోయింది. అయితే సీను వొట్టి మేక కావటం వల్ల భయపడ్డాడు. అతని అవస్థ చూళ్ళేక తనే అతన్ని ప్రోత్సహించింది.

సీను తనని ఎట్లా ప్రేమించాడో వర్ణిస్తే తీరదు. అతనికింకో ప్రపంచమే లేదు. చదివేవాడు కాదు, నా కోసం చదువు పాడుచేసుకోకు అని సలహా చెప్పటం కూడా ఎంత క్రూరం!.... ఆ ప్రేమలో పడిపోయి సీను తన కష్ట సుఖాలు కూడా విచారించేవాడు కాదు. కాని తను అతని ప్రేమ కోసం ఎన్ని కష్టాలైనా పడింది.

ఇంకో తమాషా ఏమిటంటే, సీను ఇంత ప్రేమలోనూ తనతో వందసార్లు రోజూ పోట్లాడేవాడు. తన ప్రతి చూపునూ మాటనూ విమర్శించి, తన కతనిమీద ప్రేమ లేదని తేల్చేవాడు. వొట్టి పసిపిల్లవాడి తంతు!

ఇంక సీను అసూయ చెప్పటానికి వీల్లేదు. తన ఇతర స్నేహితులు, నాబోటి

వాళ్ళుంటారా, వాళ్ళందరు తన ప్రేమను పంచుకుంటున్నారని దెప్పేవాడు. అతనికి తను తప్ప ప్రపంచంలో ఆడదే లేదు. తనకూ అతను తప్ప ఇంకో మగాడే లేనట్లుండేది. కాని యథార్థంగా ఉన్న వాళ్ళతో విరోధం తెచ్చి పెట్టుకుంటామా, చెప్పండి!.....

ఈ సీను ప్రణయ కథను ఇందిర ఎంతో ఉత్సాహంతో పూర్తిగా గంటసేపు వర్ణించింది. నే నడ్డుపడకపోతే ఈ కథ తెల్లార్లూ నడిచేట్టు కనిపించింది.

"ఏమో.... ఇటువంటి ప్రేమలో నాకు విశ్వాసం లేదు.... మీ సీను వొట్టి స్వార్థపరుడల్లే ఉన్నాడు. నే నింతసేపూ విన్న కథలో సీను అనేవాడికి గల ఆత్మ ప్రియత్వం ఓటి కనిపిస్తున్నది గాని–" అని ప్రారంభించాను.

"అయ్యో! నన్ననే మాటలన్నీ అని,కళ్ళ నీళ్ళు పెట్టుకునేవాడండీ!.... సీను హృదయం నేను బాగా ఎరుగుదును!" అన్న దిందిర.

"అదృష్టవశాత్తూ నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు. కాని ఎప్పుడాడదాన్ని ముద్దుపెట్టుకోబుద్ధి అయేదీ నాకు తెలుసు... ఇప్పుడు నిన్ను ముద్దు పెట్టుకోబుద్ధి అవుతున్నది. నువ్వీ కథంతా కాస్సేపు కట్టిపెడితే–"

## 2

ఇందిరతో ప్రణయం నడపటంకంటె సులభమైన విషయం లేదు. కామాన్ని ఆకలిదప్పుల లెక్కకు తెచ్చింది నా కొక్క ఇందిరే కనిపిస్తున్నది.

అనేక మందికి చప్పున వశమయిందిగదా అని ఇందిర వొట్టి వీటి దనటం తప్పేమో అనుకుంటాను. ఇందిర వెకిలి మనిషి కాదు. ఇతరులల్లే తన దగ్గిర ఏదో దాచుకోదగిన ముల్లె ఉన్నట్టు నటించదు; మనస్సు చప్పున ఇచ్చేస్తుంది – మనస్సిచ్చి శరీరం దాచుకోదు... ప్రపంచంచేత తప్పు పట్టించుకోకుండా ప్రవర్తిస్తూ వెకిలితనం వెళ్ళగక్కే వాళ్ళు చాలామంది ఉన్నారు.

ఇందిరను నేనెప్పుడూ ఏమీ అనను, విమర్శించను; ఇందిర కేమీ బోధించను, ఉపదేశించను; ఇందిరను తేలికచేసి చూడను, అన్యాయం చెయ్యను.

ఇందిరను అన్యాయం చేసినవాడు పురుగులు పడి పోతాడు.

అయితే నేను ఇందిరని ఆరాధించలేదు. ఆమెను గురించి కలలు కనలేదు. ఆవిడచుట్టూ గగన సౌధాలు కట్టలేదు.

ఈ పనులు చెయ్యలేకపోవటం పెద్ద తప్పుగా నాకు తోచలేదు.

ఈనాటి సంస్కారం – తెలుగువాళ్ళ సంస్కారం – ఇందిరకంటె ఉత్తమమైన మనిషి నివ్వలేదని నేను గట్టిగా నమ్ముతాను.

వైకుంఠ మనేది ఉంటే ఇందిర చచ్చి వైకుంఠానికి పోతుంది.

ఇందిరకూ నాకూ ఏదో ఉందని తెలియగానే కొందరు మూఢులు మా రంకు ప్రచారం చేసి మాకేదో ఖ్యాతి తేవాలని చూశారు. మా రంకు గోప్యంగా ఉంచటానికి నే నెటువంటి ప్రయత్నమూ చెయ్యలేదని వాళ్లెరగరు.

మరికొందరు మూఢులు - ఇందిరతో సంబంధం ఉన్నవాళ్ళు - నన్ను చూసి అసూయ పడాలని కూడా చూశారు... ఇందిర ప్రచారం చేస్తున్న ఉత్తమజాతి సంస్కారం వాళ్ళ కేకోశానా అరగలేదు, పాపం!

నామటుకు నాకు అసూయలో ఏమీ విశ్వాసం లేదు... అది జీవశక్తిని దుర్వ్యయం చెయ్యటమేగాని మరోటి కాదు.

అపఖ్యాతికి వెరవక, అసూయలో విశ్వాసం లేని వాణ్ణి ఎవరేం చెయ్యగలరూ?... మమ్మల్ని గురించిన అల్లరి దానంతట అదే సద్దుమణిగింది.

నేను ముఖ్యంగా కోరేది ఇందిర శరీరం కాదు - ఇందిర స్నేహం. దాన్నెవరూ అడ్డలేకపోయినారు.

అడపా దడపా అయిదు రూపాయల నోట్లిచ్చుకుని ఇందిర ద్వారా అడ్డమైన వాళ్ళనూ ఆదుకుంటూ ఇందిర స్నేహితానికి పాత్రుణ్ణయినాను.

## 3

ఓ రోజున ఇందిర వెంట సీను మా గదికొచ్చాడు. తనకూ ఇందిరకూ ఏమీ సంబంధం లేనట్లు ప్రవర్తించటానికి అతను పడేపాట్లు చూసి అతను సీనేనని పోల్చుకో గలిగాను.

ఇందిర సీను మొహం మీదినుంచి కళ్ళు తియ్యలేకుండా ఉంది - నాతో మాట్లాడేటప్పుడు కూడా.

"ఈయనే శ్రీనివాసరావు" అన్నది ఇందిర.

"నే నట్లాగే అనుకున్నాను!" అన్నాను.

"కాకినాడలో మంచి పేరుగల ప్లీడరు. నెలకి అయిదారు వొందలు సంపాయిస్తాడు నిక్షేపంగా!"

ఈ మాట శుద్ధ అబద్ధంగా కనిపించింది. అతను ప్లీడరీ మొదలుపెట్టి ఏ రెండు మూడేళ్ళు తప్ప అయివుండదు. అతను వయసులో నా కంటే అధమం ఏడెనిమిదేళ్ళు చిన్నల్లే కనిపించాడు. అతను కాకినాడ్లో, ఈ రోజుల్లో అయిదారొందలు సంపాయిస్తున్నా డంటే ఎట్లా నమ్మటం?

కాని సీను ఇందిరకు ఎదురు చెప్పలేదు.

నాకు సీనును చూస్తే అసహ్యం వేసింది. అతనికి మటుకు నా మీద అనుమానం కలిగినట్టు లేదు. అతన్ని ఇందిర కళ్ళతో అంత ప్రత్యక్షంగా ఆరాధిస్తుంటే నాలో ఏ వికారం లేకపోవటం అతనికి నమ్మకం ఇచ్చి ఉంటుంది.

నాలో కొంత వికారం కలక్కపోలేదు. ఇందిర నన్నే అట్లా కళ్ళతో ఆరాధిస్తే నేను ఆమె నెప్పుడో మార్చి ఉండేవాణ్ణి – అధమం కృతజ్ఞత అయినా ప్రకటించి ఉండేవాణ్ని. అతని మొహంలో అటువంటి కృతజ్ఞత ఏమీ కనుపించలేదు.

ఇందిర తనని ఆరాధిస్తుంటే సీను తన స్వార్థం గురించి ఏదో ఆలోచిస్తున్నాడు!

సీను మనస్సులో ఏదో క్షోభ ఉన్నట్లు కనిపించింది. అయితే ఆ క్షోభకూ, ఇందిరకూ ఏమీ సంబంధం ఉన్నట్టు లేదు.

రెండు మూడు రోజులు ఇందిర నాక్కనిపించలేదు..... ఓ రోజు రాత్రి పొద్దుపోయి నా గదికి వచ్చి పరధ్యానంగా కూచున్నది.

"సీను వెళ్ళాడా?" అన్నాను.

"పాపం.... వెళ్ళాడు!" అన్నది.

పాపానికి కారణం అడిగాను.

"బోలెడంత ఆస్తి... లక్షణంగా బోలెడంత సంపాయిస్తాడు... కాని సీనుకు ఇంట్లో సౌఖ్యం లేదు రంభంటి పెళ్ళాం. కాని ఆ మనిషికి హృదయం లేదు. సీనుది చాలా సుకుమారమైన హృదయం. ఆ మనిషి తనకెంత గొప్పమొగుడు – ఎంత మంచి మొగుడు దొరికాడో తెలీక అతని హృదయాన్ని సూదులు పెట్టి గుచ్చుతుంది... సీను బాధపడతాడు కాని, ఇతర్లని బాధ పెట్టలేడు... అదిచూసి ఆవిడ నానాటికి విజృంభించింది... పైగా అత్తగారు కూడా ఇంట్లోనే ఉంటుంది. తల్లీ కూతురూ ఏకమై అతని మనస్సుకు శాంతి లేకుండా చేస్తున్నారు" అని చెప్పిందిందిర.

"ఇద్దరాడవాళ్ళని అదుపు చెయ్యలేని వాణ్ణి గురించి మనం విచారించి ఏం లాభం?"

ఈ ముక్క నాకు తట్టనేలేదు.

"విచారించి ఏం చేస్తావు?" అన్నాను.

"అదే ఆలోచిస్తున్నాను" అన్నది.

ఇందిరలో అనాథశరణ తత్పరత తల ఎత్తింది. ఇటువంటప్పుడే ఇందిరను ముద్దు పెట్టుకోబుద్ధయేది.... కాని ఇవాళ నేను ఇందిరకు పరాయి వాణ్ని..... ఏది? సీను వెళ్ళి ఇంకా మూడు గంటలైనా కాందే!

నేను వెనక్కు తగ్గాను.

ఇందిర నా గదిలో ఇంకోపక్క పరుచుకు పడుకుంది. ఎక్కువ సేపు ఏదో ఆలోచనలో ఉండి నన్నాటే పలకరించలేదు.

అకస్మాత్తుగా అర్ధరాత్రి రెండు గంటల వేళ "నా వంటిది కొంపలో నెల్లాళ్ళుంటేనా?" అని అడిగింది.

నేను నిద్ర మత్తుగా "ఏ కొంపలో" అన్నాను.

"సీను కొంపలోనే" అన్నది.

"బాగానే ఉఙ్ఞు కాని నీవంటిది ప్రపంచంలో ఇంకొకటి లేదు. అది మరువవద్దు" అని సలహా యిచ్చాను.

## 4

ఇందిర నా సలహా పాటించలేదు. కాకినాడకు ప్రయాణం కట్టింది. ఆపటం నాశక్యం కాలేదు.

కాకినాడ వెళ్ళిన మర్నాడు ఇందిర నాకో ఉత్తరం రాసింది. సీను కాపరం బాగుచెయ్యాలనే ఇందిర దీక్ష తప్ప ఆ ఉత్తరంలో ఏమీ విశేషాలు లేవు. ఇంకో నాలుగైదు రోజుల్లోగాని అక్కడి విషయాలు విపులంగా రాయదని రెండో ఉత్తరం కోసం ఎదురు చూస్తుండగా ఇంతలో ఇందిరే తిరిగి వచ్చింది.

మనిషి చిక్కిపోయి,. పాలిపోయినట్టుగా ఉంది.

"వెళ్ళిన పని అయిందా?.... సీను కాపరం చక్కబెట్టి వచ్చావా?" అన్నాను.

"వెళ్ళిన పని అయింది..... ఇప్పుడు సీనుగారింటో అంతా కులాసాగానే ఉన్నారు" అన్నది.

మరి ఇందిర ఉత్సాహం రైల్లో యెక్కడ పారేసుకుందో!

ఆ మాట అనేటప్పటికి ఇందిర నా రొమ్ములో మొహం దూర్చి ఏడవటం మొదలు పెట్టింది.

ఏడవటం మాని ఏం జరిగిందో చెప్పకపోతే ఇప్పుడే దొరికిన బండికి కాకినాడ వెళ్ళి శ్రీనివాసరావు మక్కెలు విరగ్గొట్టి వస్తానన్నాను.

ఇందిర జరిగిందంతా చెప్పింది. విషయం ఇదీ :

సీను భార్యకలుసిచ్చాడు. కొందరు ఆడదాని శరీరాన్ని తమ ఆత్మాభిమానంతో కొనుక్కుంటారు. సీను అటువంటి పనే చేశాడు.

సీను భార్య అసలే ధనికుల బిడ్డ. అహంకారాతిశయానికి లోటులేదు. మొగుడికి తన బంధం తప్ప ఇంకేమీ ఉండరాదని తీర్మానించుకుంది. అవతలి మనిషి మనసు నొప్పించటానికి ఆవిడకు అభ్యంతరం లేదు. సరేకదా నొప్పించే విద్యలో కూడా ఆరితేరింది.

ఇందులో ఆవిడకు శిక్షణ యిచ్చిన మనిషి సీను అత్తగారు.

సీను సుకుమార హృదయుడనే దానికేమీ సందేహం లేదు. ఆ భావకవి హృదయం అగత్యం కలిగినప్పుడన్నా ముక్కు పుటాలుబ్బించి రంకె వెయ్యలేదు.

సీను తన యిష్టానుసారం ప్రవర్తించినప్పుడల్లా తల్లి కూతుళ్ళిద్దరూ చడామడా పోట్లాడుకుని రెండు వేపుల్నుంచీ సీనును నానా మాటలూ అనేవాళ్ళు.

సీను ఇద్దర్నీ చెరో మొట్టికాయా వెయ్యక ఇంట్లోంచి లేచిపొయ్యేవాడు.

ఒక్కోరోజు సీను ఇంటికొచ్చేటప్పటికి ఇంటో వంటా తంటా ఉండేది కాదు.

సీను హోటలు కెళ్ళి భోంచేసేవాడు.

నిత్యమూ ఇదే వరస. కావటానికి బ్రాహ్మలూ సంపన్నులూ కాని, ఎంత అలగా కాపరం కూడా ఒకప్పుడు కాకపోతే ఒకప్పుడన్నా బాగుంటుంది. ఈ కాపరం దానికన్నా అన్యాయం.

ఇందిర దిగగానే ఇంటో ఆడవాళ్ళకామె ఎవరో తెలీదు. సీను ఇందిర పేరయినా పెళ్ళాం దగ్గిర ఎన్నడూ యెత్తలేదు. దాచాడు!

ఇందిర సీనుకు చాలా సలహా లిచ్చింది. అత్తగార్ని పంపెయ్యమన్నది. ఇంటో ఆడవాళ్ళకు డబ్బు అందనివ్వొద్దన్నది.

తల్లీకూతుళ్ళు పోట్లాడుకునేటప్పుడు పారిపోవద్దన్నది. అది అతనిమీద వాళ్ళు ఆయుధం కింద ఉపయోగిస్తున్నారన్నది.

సీను అన్నింటికీ, "నీకు తెలీదిందిరా!" అని సమాధానం ఇచ్చాడు.

"అసలు నువ్విప్పుడెందుకొచ్చావు?" అన్నాడు.

ఇందిర వినిపించుకోలేదు. రెండు రోజులపాటు అతని దగ్గర ఉన్న డబ్బంతా తన దగ్గిరే ఉంచింది. ఇంటి ఖర్చుకు తనే లెక్కపెట్టి యిచ్చింది.

"నా భార్య కావాలన్నది పది రూపాయలియ్యి!" అని సీను అడిగితే ఇందిర ఖచ్చితంగా లేవన్నది.

ఆ రోజు కొంపలో రాగాలూ, పెడబొబ్బలూ ఎక్కువయినై. ఇంటో నిప్పు రాజెయ్యలేదు.

'ఎవతో వచ్చి నా కాపరం చెడగొట్టుతున్నదో' – అని సీను పెళ్ళాం పెడబొబ్బలు పెట్టింది. సీను కొంపలో లేకుండా మాయమైనాడు.

ఇందిర సీను పెళ్ళాంతో ఖచ్చితంగా చెప్పేసింది.

"ఈ శషభిషలు నా దగ్గిర సాగవు. ఈ సీనును సరిగా చూసేదాకా నేను వెళ్ళను. సీనుమీద నీకెంత హక్కుందో నాకూ అంత హక్కుంది – కావలిస్తే ఇంకా ఎక్కువే వుంది!"

మర్నాడు కొంపలో మార్పు కలిగింది. సీను భార్య, అత్తగారూ ఉదయం లేచింది లగాయితు ఎంతో సఖ్యతగా వుండడమేగాక సీనుతో కూడా యెంతో అపేక్షగా ఉండటం మొదలు పెట్టారు. సీను మొహం చాటంత అయింది.

ఇందిరే కరిగిపోయింది. దుర్మార్గుడు కాసేపు సన్మార్గుడల్లే ప్రవర్తించినప్పుడు అమాయక హృదయాలకు కలిగే ఆనందానికి సామ్యంలేదు.

ఉదయమే సీనుకూ ఇందిరకూ కాఫీ ఉప్మాలు పెట్టారు. మధ్యాహ్నం సీను అత్తగారు పులిహోర చేసింది. భోజనాల దగ్గర సీను ఇందిరతో, "పులిహోర చేస్తే మా అత్తగారే చెయ్యాలి. ఇంకెవరు చేసినా నాకు బాగుండదు" అన్నాడు.

"మిగిలిన వంట యావత్తు మా అమ్మంత బాగా చేస్తానుగాని ఆ పులిహోర మటుకు కుదరదు" అన్నది సీను పెళ్ళాం.

"అయ్యో! కిందటేడు మా చెల్లెలు కూతురు పెళ్ళిలో నేను పులిహోర చేస్తే వంట బ్రాహ్మణులు వెల్లకిలా పడ్డారు! మారు వడ్డించడానికి లేకపోయింది...." అని సీను అత్తగారు ప్రారంభించింది.

ఇందిరకు పులిహోరలో ఉప్పెక్కువయిందనిపించింది, కాని చాలా బాగా కుదిరిందని ఒప్పుకుంది.

ఆ రోజు సాయంకాలం ఇందిర తన దగ్గిర ఉన్న డబ్బు సీనుకు వప్పగించేసింది.

"ఇక ఫర్వాలేదు. నీ కాపరం ఇట్లాగే నడిచిపోనీ!" అని సీనుకు సలహా ఇచ్చింది ఇందిర.

సీను కూడా ఫర్వాలేదని ఒప్పుకున్నాడు.

"అదిన్నీ – ఇక నువు పట్నం వెళ్ళిపో... నే చెబుతాగా!" అన్నాడు సీను. ఇందిరకు ఆశ్చర్యం వేసింది. తాను చేసిన ఉపకారం చూసి సీను, తాను వెడతానన్నా పోనివ్వడన్న విశ్వాసంతో ఉన్నది ఇందిర. అదీకాక అతను సుఖపడటం కళ్ళారా చూద్దామనే కాంక్ష కూడా ఇందిరకు లేకపోలేదు.

"ఏం?" అన్నదిందిర.

"నే చెబుతాగా!... అదే మంచిదీ!" అన్నాడు సీను.

"మళ్ళీ కొంపలో అల్లరి జరక్కుండా చూసుకుంటావు కద!" అన్నది ఇందిర........

"స్టేషనుదాకా రావూ, సీనూ?" అన్నదిందిర.

"వొద్దునుగాని... మా అత్తగారూ నా భార్యా సుబ్బారావు పంతులు గారింటికి ప్రయాణమవుతున్నారు...." అన్నాడు సీను.

బిక్క మొహంతో ఇందిర పట్నం చేరుకుంది.

## 5

"ఎన్నటికీ ఎవర్నీ నమ్మను... నా మీద నిజంగా ప్రేమ గలవాడివి నువ్వొక్కడివే కనిపిస్తున్నావు!" అన్నదిందిర నా జుట్టు చెరుపుతూ.

"నేనా! ఎబ్బె, నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు... నాకు ప్రేమలో నమ్మకం కూడా లేదు" అన్నాను భయపడుతూ.

ఇందిర నోట ప్రేమ అనే మాటవస్తే నాగు జెర్రిని చూసినట్టవుతూ వచ్చింది.

"అదే నిజమైన ప్రేమకు లక్షణం!" అన్నది ఇందిర. "ఇక నీతో తప్ప ఇంకెవ్వరితోనూ స్నేహం చెయ్యను."

"మళ్ళా నన్ను కూడా ఇంకో శ్రీనివాసరావును చెయ్యాలని చూస్తున్నావు..... కాని శ్రీనివాసరావు అనాథ, నేను కాను!"

ఈ ముక్క నేను ఇందిరతో అనలేదు, నాలో నేనే అనుకున్నాను.

*మొదటి ముద్రణ : పట్నవాసం కథల సంపుటి, ఏప్రిల్ 1952*
*దేశి కవితా మండలి, విజయవాడ*